వలస వచ్చిన వారి కంటే హీనమా?

- కాంగ్రెస్ సీనియర్ల ఆక్రోశం
- మొదటి జాబితాలో టికెట్ దక్కని పొన్నం, కొండా దంపతులు
- మధుయాష్కీ సైతం పక్కకు?
- ఆందోళనతో మధుయాష్కీ ఇంట్లో నాయకుల భేటీ

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో సీనియర్ నేతలను ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పించే కుట్ర జరుగుతున్నదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో భాగంగానే ఇటీవల ప్రకటించిన అభ్యర్థుల మొదటి జాబితాలో సుమారు 20 మంది సీనియర్లకు అధిష్ఠానం చోటివ్వలేదని అంటున్నారు. మొదటి జాబితాలో స్థానం దక్కని వారు రాష్ట్రస్థాయిలో కొంత పేరున్న వారు కాగా.. వీరు గత ఎన్నికల్లో పోటీ చేసిన వారై ఉండటం గమనార్హం. ఇటువంటి సీనియర్లను విస్మరించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలనే పార్టీలోకి వలస వచ్చిన వారికి టికెట్లిచ్చిన అధిష్ఠానం తమను విస్మరించడంపై వారు.. 'కొత్త వారికంటే మేము హీనమా?' అని ప్రశ్నిస్తున్నారు. ఇన్నేండ్లుగా పార్టీకి విధేయులుగా ఉన్న తమను ఇది అవమానించడమేనని అంటున్నారు. కాంగ్రెస్ అధిష్ఠానం వీరికి టికెట్లు ఇవ్వొద్దని భావిస్తున్నదా? అందుకే కావాలనే వారిని దూరం పెట్టిందా? అంటూ రాజకీయ పరిశీలకులు సందేహం వ్యక్తం చేస్తున్నారు. రెండో జాబితాలోనైనా వీరికి చోటు దక్కుతుందా అని ప్రశ్నిస్తున్నారు. మొదటి జాబితాలో చోటు దక్కని సీనియర్ నేతలలో మధుయాష్కీ గౌడ్, పొన్నం ప్రభాకర్, కొండా దంపతులు, షబ్బీర్ అలీ, బలరాం నాయక్,

రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, అజారుద్దీన్, విష్ణువర్ధన్‌రెడ్డి, బాలు నాయక్, వీ హన్మంతరావు, సురేశ్ షెట్కర్, మహేశ్‌కుమార్ గౌడ్, అద్దంకి దయాకర్, బెల్లయ్య నాయక్, సర్వే సత్యనారాయణ, మల్‌రెడ్డి రంగారెడ్డి, ఈరవత్రి అనిల్ ఉన్నారు. అధిష్ఠానానికి అత్యంత సన్నిహితునిగా పేరున్న మధుయాష్కీ గౌడ్ పేరు లేకపోవడంపై నేతలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. పొన్నం ప్రభాకర్, కొండా దంపతుల్లో ఒక్కరికైనా చోటు దక్కకపోవడంపై పార్టీలో చర్చ జరుగుతున్నది.

కొత్తవారి కన్నా తక్కువా?

ఇటీవలే కాంగ్రెస్‌లో చేరిన జూపల్లి కృష్ణారావు, కసిరెడ్డి నారాయణరెడ్డి, వేముల వీరేశం, వినయ్‌కుమార్‌రెడ్డి, కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి వంటి పాత, కొత్త నేతలకు మొదటి జాబితాలో చోటు కల్పించిన అధిష్ఠానం మిగిలిన సీనియర్ నేతలను ఎందుకు విస్మరించిందని పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. 'ఎలాంటి ఇబ్బంది లేనటువంటి, ఒకే దరఖాస్తు వచ్చిన స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తున్నాం' అంటూ పార్టీ నేతలు తొలి జాబితా ప్రకటన సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. దీని ప్రకారం మిగిలిన సీట్లలో ఇబ్బందులు ఉన్నాయని తెలిపోయింది. మిగిలిన సీనియర్ నేతలకు ఆయా స్థానాల్లో పెద్దగా ప్రాభవం లేదని పార్టీ తేల్చేసిందా అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. దీంతో రెండో జాబితాలోనూ మిగిలిన సీనియర్లలో ఎంత మందికి స్థానం దక్కుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. టికెట్ దక్కని పలువురు సీనియర్లు మధుయాష్కీ ఇంట్లో భేటీ అయ్యారు. వారిలో మాజీ కేంద్ర మంత్రి బలరాం నాయక్, రాజయ్య, సురేశ్ షెట్కర్ ఉన్నారు. తొలి జాబితాలో టికెట్ రాకపోవడానికి గల కారణంపై వీరి చర్చించినట్టు తెలిసింది. రెండో జాబితాలోనూ టికెట్ దక్కకపోతే ఏం చేయాలనేదానిపై కూడా వీరి చర్చించినట్టు సమాచారం.

సీఎం పదవి నన్ను కోరుకుంటున్నది

- హఠాత్తుగా పదవి వస్తే కాదనను
- నా కొడుకు రాజీనామా చేస్తాడు
- ఆర్నెల్లలో ఎమ్మెల్యే అవుతా: జానా

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): ఆలు లేదు చూలు లేదు కొడుకు పేరు ఏదో అన్న చందంగా ఉన్నది కాంగ్రెస్ పరిస్థితి. ఆ పార్టీలో ఇంకా టికెట్ల పంచాయితీనే తెగలేదు.. అప్పుడే సీఎం పదవిపై లొల్లి మొదలైంది. అభ్యర్థుల పేర్లే ఇంకా పూర్తిగా ఖరారు కాలేదు. కానీ అప్పుడే సీఎం రేసులో నేనున్నానంటే.. నేనున్నానంటూ నేతలు రచ్చకెక్కుతున్నారు. ప్రస్తుత పీసీసీ అధ్యక్షుడితోపాటు పలువురు సీనియర్ నేతలు ఇప్పటికే తాము సీఎం రేసులో ఉన్నామని ప్రకటించుకోగా.. చాలా కాలం తరువాత మీడియా ముందుకొచ్చిన ఆ పార్టీ సీనియర్ జానారెడ్డి 'నేను కూడా ఉన్నా' నని చెప్పుకున్నారు. ఆయన ఒక అడుగు ముందుకేసి తాను సీఎం పదవిని కోరుకోనని.. ఆ పదవే తనను కోరుకుంటుందని చెప్పారు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలంలో మంగళవారం నాగార్జునసాగర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, తన కుమారుడు జయవీర్‌రెడ్డితో కలిసి ఆయన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ సీఎం కావాలన్న తన అభిలాషను మరోసారి బయటపెట్టారు. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే జానారెడ్డి సీఎం రేసులో ఉంటారా అని ప్రశ్నించగా.. 'పదవుల రేసులో నేనెప్పుడూ లేను. పదవులే రేసులో ఉండి నన్ను అందుకుంటాయి' అని వ్యాఖ్యానించారు. 'ప్రజల హృదయాల్లో నేను సీఎం కావాలని ఉంది. సీఎం పదవి హఠాత్తుగా రావొచ్చేమో. ఒకవేళ ఏవైనా పదవులు వస్తే నేను కాదనను. నాకు సీఎం అయ్యేందుకు అన్ని అర్హతలూ ఉన్నాయి. 21 ఏండ్లకే రాజకీయాల్లోకి వచ్చిన, 36 ఏండ్లకే మంత్రినయ్యా, ఏ సీఎం చేయనన్ని శాఖలకు మంత్రిగా చేసినా' అని చెప్పారు. ఎమ్మెల్యేగా పోటీలో లేని మీరు సీఎం ఎలా అవుతారని ప్రశ్నించగా.. 'ఆర్నెళ్ల సమయం ఉంటుంది. ఆ లోపు నా కొడుకు రాజీనామా చేస్తడు. నేను పోటీ చేసి ఎమ్మెల్యే అవుతా' నంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీగా లేకున్నా పీవీ నర్సింహారావు ప్రధానమంత్రి కాలేదా అని ప్రశ్నించారు. సీఎం అనే ప్రజల చివరి కోరిక కూడా నాకు కూడా తెల్వకుండానే తీరవచ్చు' అంటూ చెప్పుకొచ్చారు. దాంతో జానారెడ్డి వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారాయి. తాను అసెంబ్లీ ఎన్నికల బరి నుంచి తప్పుకొంటానని చెప్పి కుమారుడిని రంగంలోకి దింపిన జానారెడ్డి... హఠాత్తుగా ఇలా మాట్లాడడం ఏంటన్న చర్చ మొదలైంది. ఇప్పటికే కాంగ్రెస్ పార్టీలో సీఎం ఆశావహుల సంఖ్య భారీగా ఉన్న సంగతి తెలిసిందే. రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పలు సందర్భాల్లో తామూ సీఎం రేసులో ఉన్నామంటూ వ్యాఖ్యలు చేశారు. తాజాగా జానారెడ్డి కూడా రేసులోకి రావడంతో కాంగ్రెస్ రాజకీయాలు మరింత రక్తికట్టించనున్నాయి.

భాగ్యలక్ష్మి.. రేవంత్‌కు ముడుపులు నిజం

మొదటిపేజీ తరువాయి...

అభ్యర్థి నుంచి రూ.10 కోట్లు, 5 ఎకరాల భూమి తీసుకుంటూ రేవంత్ ఎన్నికలను అవినీతిమయం చేస్తున్నారని ఆరోపించారు. ఎక్కువ మొత్తంలో ముడుపులు అందించిన వారికి మాత్రమే పార్టీ టికెట్లను కేటాయించారని తెలిపారు. తమ ఆరోపణల్లో నిజం లేకుంటే రేవంత్.. చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి సాక్షిగా 24 గంటల్లో ప్రమాణం చేయాలని ఉప్పల్ కాంగ్రెస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. లేదంటే నిజం ఒప్పుకొని నిష్పక్షపాతంగా టికెట్లను కేటాయించాలని స్పష్టంచేశారు.

చార్మినార్ వద్ద రేవంత్‌రెడ్డికి సవాల్ విసురుతున్న రాగిడి లక్ష్మారెడ్డి

గోషామహల్‌లో రేవంత్‌ను అడ్డుకుంటాం

గోషామహల్‌లో కాంగ్రెస్ పటిష్ఠంగా ఉన్నదని తమలో ఎవరికి టికెట్ ఇచ్చినా అందరం కలిసికట్టుగా పనిచేసి పార్టీని గెలిపిస్తామని నియోజకవర్గ నేతలు స్పష్టంచేశారు. ఖైరతాబాద్ నియోజకర్గానికి చెందిన సునీతరావుకు గోషామహల్ టికెట్ ఎలా ఇస్తారని నిలదీశారు. టికెట్ మార్చాలని, లేకుంటే తామంతా రేవంత్‌ను సైతం గోషామహల్‌లో అడ్డుకుంటామని హెచ్చరించారు. గోషామహల్ ఆశావాహులైన యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్ ముదిరాజ్, సీనియర్ నేత కన్నయ్యలాల్ సాహు ప్రత్యేకంగా సమావేశమై రేవంత్ తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. చేవెళ్ల కాంగ్రెస్ అభ్యర్థిగా భీం భరత్ పేరును ప్రకటించడంతో టికెట్ ఆశించి భంగపడ్డ ఇద్దరు నేతలు ధిక్కార స్వరాన్ని వినిపిస్తున్నారు.

మహేశ్వరం, ఇబ్రహీంపట్నంలోనూ..

కాంగ్రెస్ అధిష్ఠానం మహేశ్వరం, ఇబ్రహీంపట్నం నియోజకవర్గాలకు అభ్యర్థులను తేల్చకపోవడంతో రెండు చోట్లా టికెట్ల లొల్లి రోజురోజుకూ ముదురుతున్నది. మహేశ్వరం సీటు కోసం పది మంది వరకు పోటీపడుతున్నారు. డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, సీనియర్ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగారెడ్డి పోటీ పడుతున్న వారిలో ఉన్నారు. ఆశావాహుల్లో ఒకరైన కొత్త మనోహర్‌రెడ్డిని ఇటీవలనే పార్టీ సస్పెండ్ చేసింది. ఇబ్రహీంపట్నంలో ఏడుగురు ఆశావాహులు టికెట్ కోసం పోటీపడుతున్నారు. మల్‌రెడ్డి రంగారెడ్డి, దండెం రాంరెడ్డి పోటాపోటీగా తమ అనుచరులతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రూప్ తగాదాల నేపథ్యంలో క్యాడర్ సైతం గ్రూపులుగా విడిపోయింది. ఆశావాహులు ఎవరికి వారుగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తుండటంతో నియోజకవర్గ కాంగ్రెస్‌లో లుకలుకలు నివ్వురు గప్పిన నిప్పులా ఉన్నాయని శ్రేణులు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థిని తేల్చాక అసమ్మతి భగ్గుమనక తప్పదన్న భావన పార్టీ శ్రేణుల్లోనే వ్యక్తమవుతున్నది.

టీడీపీ పాత నేతల చుట్టూ రేవంత్ చక్కర్లు

- కాంగ్రెస్ పాత నేతలను కాదని టికెట్లపై హామీ
- టీపీసీసీ అధ్యక్షుడి తీరుపై సీనియర్ నేతల మండిపాటు

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ):ఏండ్ల తరబడి కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వాళ్లను పొగపెట్టి గొడుతున్న పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో నామరూపాలు లేకుండాపోయిన టీడీపీ పాత నేతలను ఏరికోరి పార్టీలో చేర్చుకుంటున్నారంటూ సీనియర్ నేతలు మండిపడుతున్నారు. ఒకప్పుడు టీడీపీలోనే ఉన్న రేవంత్ ఆ తరువాత కాంగ్రెస్‌లోకి జంప్ చేసిన సంగతి తెలిసిందే. ఇప్పుడు తన పాత మిత్రులను ఒక్కొక్కరిని కాంగ్రెస్‌లో చేర్చడం ద్వారా తన వర్గాన్ని పెంచుకుంటున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ మాజీ నేత, మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత్‌రావు, మాజీ మంత్రులు మండవ వెంకటేశ్వరరావు, తుమ్మల నాగేశ్వరరావు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, సీతాదయాకర్‌రెడ్డి తదితర నేతలను కాంగ్రెస్‌లోకి రావాలని ఆహ్వానిస్తూ వారి ఇండ్ల చుట్టూ రేవంత్ తిరగడాన్ని కాంగ్రెస్ నేతలు ఎత్తిచూపుతున్నారు.. మండవ వెంకటేశ్వరరావుకు నిజామాబాద్ రూరల్ నుంచి పోటీకి అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చినట్టు సమాచారం. దీంతో ఈ స్థానం నుంచి టికెట్ ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ భూపతిరెడ్డి పీసీసీ అధ్యక్షునిపై మండిపడుతున్నారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డికి పాలకుర్తి టికెట్‌పై హామీ ఇవ్వడంతో ఆయన కూడా పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారు. ఈ స్థానాన్ని ఆశిస్తున్న కొండా మురళి రేవంత్ తీరును తూర్పారబడుతున్నారు. రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఇప్పటికే నర్సంపేట నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేయడం కోసం కొద్దిరోజులుగా గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. కాంగ్రెస్ పార్టీ ఫస్ట్ లిస్టులో నర్సంపేట కాంగ్రెస్ అభ్యర్థిగా దొంతి మాధవరెడ్డి పేరును ప్రకటించింది. దీంతో ఆయన పరకాల స్థానమైనా సరే అని భావిస్తున్నట్టు సమాచారం.

కాంగ్రెస్‌లో బానిసలకే సముచిత స్థానం

- తుమ్మలకో నీతి.. పొన్నాలకు మరో నీతా?
- అహకారంతోనే రేవంత్ అనుచిత వ్యాఖ్యలు
- కాంగ్రెస్ నేత, ఓదెల జడ్పీటీసీ రాములు ధ్వజం

పెద్దపల్లి, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో బానిసలకే సముచిత స్థానం ఉంటదని, ఆత్మగౌరవం గల నాయకులకు మనుగడ లేదని పెద్దపల్లి జిల్లా కాంగ్రెస్ ముఖ్యనేత, ఓదెల జడ్పీటీసీ గంటా రాములు విమర్శించారు. ఆత్మగౌరవం లేని ఆ పార్టీలో తాను కొనసాగేది లేదని తేల్చిచెప్పారు. రేవంత్‌రెడ్డి అహకారంతోనే బీసీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రెండుసార్లు ఓడిపోయిన తుమ్మల నాగేశ్వర్ రావును ఇంటికెళ్లి ఆహ్వానించిన రేవంత్.. పొన్నాలను మాత్రం సిగ్గుండాలా? అని తులనాడటం బీసీలపై ఆయనకున్న చులకన భావానికి నిదర్శనమని పేర్కొన్నారు. మంగళవారం పెద్దపల్లిలో ముఖ్యకార్యకర్తలతో కలిసి రాములు మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధిష్ఠానం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయాల్లో చురుగ్గా లేని మండవ వెంకటేశ్వర్ రావు, కసిరెడ్డి నారాయణరెడ్డిని వాళ్ల ఇండ్లకు వెళ్లి ఆహ్వానించిన రేవంత్‌రెడ్డి.. ఒక బీసీ నేత.. 40 ఏండ్లు కాంగ్రెస్‌కు సేవచేసిన విద్యావంతుడు పొన్నాల లక్ష్మయ్యను మాత్రం సిగ్గుండాలా? అని అగౌరవపరిచేలా మాట్లాడి.. తుమ్మల దగ్గర ఒక నీతి.. పొన్నాల పట్ల మరో నీతి ప్రదర్శించారని దుయ్యబట్టారు. ఎన్నో ఏండ్ల నుంచి కాంగ్రెస్‌లో కొనసాగుతున్న తాను.. రూ.50 వేలు చెల్లించి టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నానని, తనతోపాటు మరో 80 మంది బీసీ నాయకులు పార్టీ పెద్దలను కలిసేందుకు ఐదు రోజులు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో ఎదురుచూసినా అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని ఆరోపించారు. త్వరలోనే తన కార్యాచరణను ప్రకటిస్తానన్నారు.

కామారెడ్డిలో పోటీ నా వల్ల కాదు!

- కేసీఆర్ పోటీచేస్తే ఓటమి ఖాయం
- అధిష్ఠానానికి షబ్బీర్ అలీ విజ్ఞప్తి

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): కామారెడ్డిలో సీఎం కేసీఆర్‌పై పోటీకి కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి షబ్బీర్ అలీ వెనుకాడుతున్నట్టు తెలిసింది. సీఎం కేసీఆర్‌ను ఎదుర్కోవడం తన వల్ల కాదని ఆయన పార్టీ అధిష్ఠానం వద్ద మొరపెట్టుకుంటున్నట్టు సమాచారం. తనను కామారెడ్డి నుంచి తప్పించాలని, మరో సీటు కేటాయించాలని కోరుతున్నట్టు తెలిసింది. ఇప్పటికే సీఎం కేసీఆర్ కామారెడ్డి బరిలో నిలిచిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌లో వణుకు పుట్టింది. తొలుత సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొని, ఆయన్ను ఓడిస్తానని ప్రగల్భాలు పలికిన షబ్బీర్ అలీ ఇప్పుడు మాత్రం తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సీఎం కేసీఆర్‌పై పోటీ చేస్తే... తాను ఓడిపోవడం ఖాయమని, అప్పుడు పరువు పోతుందని ఆయన అంతరంగికులతో వ్యాఖ్యానించినట్టు సమాచారం. దీంతో కామారెడ్డి నియోజకవర్గాన్ని వీడాలని ఆయన నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. దీనిపై పార్టీ అధిష్ఠానం ఆయనకు ఎలాంటి హామీ ఇవ్వలేదని తెలిసింది. రెండో జాబితాలో కామారెడ్డి నుంచి ఆయన పేరు ఉంటుందో లేదో చూడాలని అంటున్నారు.

కోరిన సీట్లు ఇస్తేనే పొత్తు

- 48 గంటల్లో తేల్చాలని కాంగ్రెస్‌కు కామ్రేడ్ల డెడ్‌లైన్

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): తాము కోరిన సీట్లు ఇస్తేనే పొత్తు కొనసాగుతుందని లెఫ్ట్ పార్టీలు కాంగ్రెస్‌ను హెచ్చరిస్తున్నాయి. తమకు ఐదేసి సీట్లు ఇవ్వాలని సీపీఐ, సీపీఎం ప్రతిపాదించగా.. రెండేసి చొప్పున ఇవ్వడానికి కాంగ్రెస్ ఒప్పుకున్నట్టు సమాచారం. అయితే ఆ రెండు తాము కోరుకున్న సీట్లనే ఇవ్వాలని కమ్యూనిస్టులు పట్టుబడుతుండగా.. ఒకటి కోరుకున్న సీటు, మరొకటి వేరొక చోట ఇస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. 48 గంటల్లో ఏదో ఒకటి తేల్చాలని లెఫ్ట్ నేతలు కాంగ్రెస్‌కు గడువు విధించారు. కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోతే తామైనా కలిసి పోటీ చేయాలని సీపీఐ, సీపీఎం నిర్ణయించాయి.

బీజేపీ మాట.. త్వరలో!

- మ్యానిఫెస్టో, జాబితాపై రాష్ట్ర నాయకత్వం మౌనం
- ఢిల్లీలో ఇంకా పడని ఆమోద ముద్ర
- నేడు, రేపు అంటూ దాటవేత

బీజేపీ కార్యకర్త: సార్.. ప్రచారానికి పోతే మీ ఎజెండా ఏదని ప్రజలు అడుగుతున్నారు. మన మ్యానిఫెస్టో ఎప్పుడు?.

రాష్ట్ర నాయకులు: 'త్వరలో..' విడుదల చేస్తాం.

బీజేపీ నాయకుడు: అన్నా.. ఎవరి పేరుచెప్పి ఓటు అడగాలో తెలియని పరిస్థితి. అభ్యర్థుల జాబితా ఏదన్నా?.

రాష్ట్ర నాయకత్వం: త్వరలో వస్తుంది.

బీజేపీ నేత: అన్నా.. పార్లమెంటరీ బోర్డు సమావేశం అయ్యిందా? మన లిస్ట్‌ను ఒప్పుకుందా?

రాష్ట్ర నాయకత్వం: త్వరలో సమావేశం అవుతుంది.

బీజేపీ అభిమాని: సార్.. పొత్తులేమన్నా ఉంటాయా? ఒంటరిగా పోతున్నామా?

రాష్ట్ర నాయకత్వం: త్వరలో స్పష్టత వస్తుంది.

హైదరాబాద్, అక్టోబర్ 17(నమస్తే తెలంగాణ): ప్రస్తుతం రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి ఇది. ఓవైపు బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించి, మ్యానిఫెస్టోను విడుదల చేసి జోరుగా ప్రచారం చేస్తూ.. సెంచరీ కొట్టేదిశగా వేగంగా అడుగులు వేస్తున్నది. మరోవైపు కాంగ్రెస్ 55 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి, ఆరు గ్యారంటీలంటూ ఏదో హడావుడి చేస్తున్నది. వాటినే పట్టుకొని ఆ పార్టీ నేతలు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళ్తున్నారు. మంగళవారం బీఎస్పీ కూడా తమ మ్యానిఫెస్టోను విడుదల చేసింది. కానీ.. బీజేపీలో మాత్రం వింత వైఖరి కనిపిస్తున్నదని పార్టీ నేతలు వాపోతున్నారు. ఇతర రాజకీయ పార్టీలన్నీ పరుగుల పోటీలో ఉన్నట్టు దూసుకెళ్తుంటే.. బీజేపీ రాష్ట్ర నాయకత్వం మాత్రం ఎన్నికలతో సంబంధమే లేనట్టు, వచ్చే ఏడాదో, రెండేండ్ల తర్వాతో వచ్చే ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టుగా నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నదని ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి బీజేపీ అభ్యర్థుల జాబితాను ఈ నెల మొదటివారంలో విడుదల చేస్తామని చెప్పారు. తర్వాత దానిని రెండో వారానికి, ఆ తర్వాత 15వ తేదీకి వాయిదా వేశారు. ఇప్పుడు 'త్వరలో' అని మాత్రమే చెప్తున్నారు. ఇతర పార్టీల నుంచి వచ్చే నేతల కోసమే ఇలా ఆలస్యం చేస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. మొదటి నుంచీ 119 నియోకవర్గాల్లో నిలబడేందుకు అభ్యర్థులు లేరన్నది అందరికీ తెలిసిందే. అందుకే బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నుంచి వచ్చే నేతల కోసం ఎదురుచూసింది. బీఆర్‌ఎస్‌లో అభ్యర్థులను ప్రకటించినా అసమ్మతి తలెత్తలేదు. కాంగ్రెస్‌లో మాత్రం అసమ్మతి భగ్గుమంటున్నది. ఆ అసమ్మతి నేతలంతా బీజేపీలో చేరుతారని రాష్ట్ర నాయకత్వం ఆశపడింది. కానీ వారిలో అత్యధికులు బీఆర్‌ఎస్‌లో చేరుతుండటంతో బీజేపీకి గొంతులో పచ్చివెలక్కాయ పడ్డట్టయ్యింది. కాంగ్రెస్‌లో రెండో జాబితా విడుదల చేసిన తర్వాత మరికొందరు నేతలు వస్తారనే ఆశతోనే బీజేపీ ఇంకా జాబితాను విడుదల చేయడం లేదని పేర్కొంటున్నారు. బీజేపీ జాతీయ పార్లమెంటరీ బోర్డు సమావేశం వరుసగా వాయిదా వేస్తున్నారు. బుధవారం ఉంటుందని నేతలు చెప్తున్నా, సమావేశం జరిగేది అనుమానమేనని సమాచారం. దీంతో ఏం చేయాలో అర్థం కాక బీజేపీ రాష్ట్ర నాయకత్వం తలలు పట్టుకుంటున్నది.

9 రోజుల్లో 101 కోట్లు

- నగదు, మద్యం అక్రమ రవాణాకు చెక్
- తాయిలాలను అడ్డుకుంటున్న ఈసీ

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తుండటంతో రాష్ట్రంలో భారీగా నగదు, బంగారం, మద్యం, ఇతర విలువైన వస్తువులు పట్టుబడుతున్నాయి. ఈ నెల 9 నుంచి 17 వరకు అక్రమంగా తరలిస్తున్న రూ.101.18 కోట్లకుపైగా విలువైన నగదు, మద్యం, బంగారం, ఆభరణాలు, ఇతర వస్తువులను పోలీసులు, ఎన్నికల టాస్క్‌ఫోర్స్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నట్టు రాష్ట్ర ఎక్స్‌పెండిచర్ నోడల్ ఆఫీసర్ మహేశ్ భగవత్, నోడల్ ఆఫీసర్ సంజయ్‌కుమార్ జైన్ మంగళవారం ప్రకటించారు. డీజీపీ అంజనీ కుమార్ నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 373 ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 374 స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్‌లు, 95 సరిహద్దు చెక్‌పోస్టుల ద్వారా విస్తృత తనిఖీలు చేపట్టి ఈ సొత్తును స్వాధీనం చేసుకున్నట్టు వెల్లడించారు. అందులో రూ.55,99,26,994 నగదు, రూ. 2,60,57,004 విలువైన మద్యం, రూ.3,42,84,275 విలువైన మాదకద్రవ్యాలతోపాటు రూ.38,45,44,526 విలువైన బంగారం, ఇతర ఆభరణాలు ఉన్నట్టు వివరించారు. 2018లో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఎన్నికలు పూర్తయ్యే వరకు మొత్తం రూ.103 కోట్లు పట్టుబడ్డాయని, ఈసారి దాదాపు అంతే మొత్తం సొత్తును కేవలం 9 రోజుల్లోనే స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఆయుధ యజమానులు 5,529 లైసెన్స్‌డ్ గన్స్‌ను డిపాజిట్ చేసినట్టు చెప్పారు. లైసెన్స్ లేని మరో 3 ఆయుధాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు ఇప్పటివరకు 17,128 మందిపై 5,252 బైండోవర్ కేసులు నమోదు చేసినట్టు తెలిపారు.

ప్రతి ఫిర్యాదుకు స్పందిస్తాం

- ఈ నెల చివరి నాటికి ఓటరు గుర్తింపు కార్డులు
- ఎపిక్ కార్డులు ఎవరైనా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
- రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి వికాస్‌రాజ్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర శాసనసభకు శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ కోరారు. ప్రతి ఫిర్యాదుకు స్పందిస్తామని చెప్పారు. ఈ నెలాఖరు నాటికి ఓటరుకు గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ-ఎపిక్ కార్డులను ఓటర్ల సేవా పోర్టల్ నుంచి ఓటర్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మంగళవారం బీఆర్కే భవన్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో రాష్ట్రస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికల సంఘం తీసుకున్న చర్యలను ఆయన వివరించారు. పోటీలో ఉన్న అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సోషల్ మీడియాతో సహ ఏ అంశంపైన అయినా చేసే సహేతుకమైన ప్రతి ఫిర్యాదును సానుకూలంగా పరిశీలిస్తామని చెప్పారు. రాజకీయ ఫిర్యాదులపై సమయం, శ్రమను ఆదా చేయడంతోపాటు వీలైనంత త్వరగా న్యాయం అందించే దిశగా స్థానికంగా సహకరించాలని అన్ని జిల్లాల ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు, ఎన్నికల అధికార అధికారులకు ఆదేశాలు జారీ చేస్తామని చెప్పారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో పారదర్శకత తీసుకురావడానికి రాజకీయ పార్టీలతో ఈ నెల 14 వరకు 2,100కు పైగా సమావేశాలు నిర్వహించామని ఆయన వివరించారు.

సోషల్ మీడియాను కట్టడి చేయాలి: బీఆర్‌ఎస్

ఎన్నికలు పారదర్శకంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు అన్ని విధాలుగా సహకరిస్తామని బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సోమా భరత్‌కుమార్ పేర్కొన్నారు. సోషల్ మీడియా విశృంఖలత్వానికి అడ్డుకట్ట వేయాలని రాష్ట్ర సీఈవోను కోరినట్టు తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు అర్థమయ్యే భాషలో మాట్లాడాలని ఎస్ఈసీకి సూచించినట్టు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో విషయాలపై కాకుండా వ్యక్తిత్వం దెబ్బతినే విధంగా మాట్లాడుతున్నారని, వీటిని కట్టడి చేయాలని కోరినట్టు చెప్పారు. పోలింగ్ కేంద్రాల్లో సరిపడా వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించినట్టు పేర్కొన్నారు. ధన ప్రవాహానికి అడ్డుకట్ట వేయాలని కోరామని చెప్పారు.

ఆసక్తికరంగా 'వాట్ ఈజ్ మై గోల్' ఎలక్షన్స్

హైదరాబాద్, అక్టోబర్ 17 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ టీహబ్‌కు చెందిన 'వాట్ ఈజ్ మై గోల్' అనే స్టార్టప్ ఇటీవల మాక్ ఎలక్షన్స్ నిర్వహించింది. విద్యార్థి దశ నుంచే రాజకీయాలపై అవగాహన కల్పించేందుకు, 18 ఏండ్లలోపు విద్యార్థులకు దేశ ఎన్నికల విధానం, ఓటుకు దరఖాస్తు, ఓటు హక్కు వినియోగం, పరిపాలన, ఎమ్మెల్యే అభ్యర్థిత్వం వంటి అంశాలపై మాక్ ఎలక్షన్స్ నిర్వహించింది. రాష్ట్రంలోని వందకు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల నుంచి లక్షకు పైగా అండర్-18 విద్యార్థులు ఉత్సాహంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'అండర్-18 స్టూడెంట్ ఎంగేజ్‌మెంట్ ఇన్ పాలిటిక్స్' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా 105 నియోజకవర్గాల్లో ఈ మాక్ ఎన్నికలు నిర్వహించింది. ముందుగా 10 నియోజకవర్గాల్లోని ఎన్నికల ఫలితాలను ఆ సంస్థ విడుదల చేసింది. సుస్థిర జీవనంపైనే దృష్టి సారించిన గ్రీన్ పార్టీ అభ్యర్థులు ఐదు సీట్లు కైవసం చేసుకున్నారు. ఫ్యూచర్ పార్టీకి మూడు సీట్లు, పీపుల్స్ పార్టీకి రెండు సీట్లు చొప్పున వచ్చాయి. మిగతా నియోజకవర్గాల ఫలితాలను విడుదల చేశాక ఈ నెల 29న గచ్చిబౌలిలో ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహిస్తామని 'వాట్ ఈజ్ మై గోల్' స్టార్టప్ నిర్వాహకులు తెలిపారు. ఈ ఎన్నికలకు ప్రధాన ఎన్నికల కమిషనర్‌గా చిత్రలీ శర్మ వ్యవహరించారు. కింగ్, సన్నీ, క్రిష్, మమత, శ్రీనివాస్, వనజ, అలేఖ్య, అఖిల బృందం ఈ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించింది. గెలుపొందిన వారికి ఎన్నికల సంఘం, వై-20 సర్టిఫికెట్లు ఇప్పిస్తామని వాట్ ఈజ్ మై గోల్ ఫౌండర్ కింగ్ తెలిపారు. విద్యార్థి దశ నుంచే ఓటు హక్కు, ఎన్నికల విధానంపై అవగాహన కల్పించడం అభినందనీయమని రాష్ట్ర సీఈవో వికాస్‌రాజ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు ఎన్నికల సంఘం నుంచి సర్టిఫికెట్లు ఇస్తామని తెలిపారు.

ఓటేసిన అనంతరం సిరా గుర్తు చూపిస్తున్న విద్యార్థి ఓటర్లు

బాల్కకు 51 వేలు విరాళం

చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాల్క సుమన్ ఎన్నికల ఖర్చు కోసం చెన్నూర్ మండల మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లెల దామోదర్‌రెడ్డి రూ.51 వేలు విరాళంగా అందజేశారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లిలో మంగళవారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్స్ సమావేశంలో పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేతకాని సమక్షంలో విప్ బాల్క సుమన్‌కు ఈ మొత్తాన్ని అందజేశారు. సీఎం కేసీఆర్ రూ.లక్ష రుణమాఫీ చేయడంతో అందులో నుంచి రూ. 51 వేలు అందించినట్టు దామోదర్‌రెడ్డి తెలిపారు. - చెన్నూర్

మంత్రి వేములకు గంగపుత్ర సంఘం మద్దతు

మోర్తాడ్, అక్టోబర్ 17 : అసెంబ్లీ ఎన్నికల్లో బాల్కొండ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం వడ్యాట్ గ్రామానికి చెందిన గంగపుత్ర సంఘం సభ్యులు మద్దతు ప్రకటించారు. 24 కుటుంబాలకు చెందిన వారు మంగళవారం సమావేశమై ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు. మంత్రి వేముల చొరవతోనే తమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని వారు పేర్కొన్నారు. అనంతరం తీర్మాన పత్రాన్ని బీఆర్‌ఎస్ నాయకులకు అందజేశారు.

స్పీకర్‌కు జైకొట్టిన దళితులు

బాన్సువాడ, అక్టోబర్ 17 : తామంతా స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి వెంటే నడుస్తామని.. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్‌ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బైరాపూర్‌కు చెందిన దళితులు మద్దతు ప్రకటించారు. దాదాపు 300 దళిత కుటుంబాల సభ్యులు మంగళవారం సమావేశమై ఏకగ్రీవ తీర్మానం చేశారు. బాన్సువాడ పట్టణంలో స్పీకర్‌ను కలిసి ఏకగ్రీవ తీర్మాన కాపీని అందజేశారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంతోపాటు సంక్షేమ పథకాలను గడపగడపకూ అందజేస్తున్న పోచారం శ్రీనివాసరెడ్డిని తిరిగి గెలిపించుకుంటామని వారు ప్రకటించారు. తనకు మద్దతు తెలిపిన బైరాపూర్ దళిత కుటుంబాలకు స్పీకర్ పోచారం ధన్యవాదాలు తెలిపారు.

ఎమ్మెల్యే ఆలకు మద్దతుగా చౌలతండావాసుల ప్రతిజ్ఞ

భూత్పూర్, అక్టోబర్ 17: మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డికి ప్రతి గ్రామంలో ఓటర్ల మద్దతు రోజురోజుకూ పెరుగుతున్నది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా ఉంటామని భూత్పూర్ చౌలతండావాసులు మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే ఆల వెంటే ఉంటామని తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులందరూ పాల్గొన్నారు.